## క్లుప్తంగా

### పునఃప్రారంభమైన ఏబీ రోడ్డు పనులు



పసుకుడి - సింగిడి మధ్య పునఃప్రారంభమైన రోడ్డు నిర్మాణ పనులు

భామిని: రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి భామిని మండల సమస్యలు వెళ్లిన తక్షణమే పరిష్కార చర్యలు ప్రారంభమయ్యాయి. ఇందులో భాగంగా భామిని మండలం పసుకుడి - సింగిడి మధ్య మధ్యలో నిలిచిపోయిన ఏబీ రోడ్డు పనులను శుక్రవారం పునఃప్రారంభించారు. ఈ నెల 28న అమ్మ ఒడి పథకం నిధుల విడుదలకు చినమేరంగి వచ్చిన సీఎం దృష్టికి భామిని మండల సమస్యలను ఆ పార్టీ మండల అధ్యక్షుడు తోట సింహాచలం తీసుకువెళ్లారు. ఫలితంగానే ఏబీ రోడ్డు పనులు ప్రారంభమయ్యాయని స్థానికులు సంతోష పడుతున్నారు.

### చురుగ్గా కాలువల నిర్మాణం



పెద్దకోటిపల్లిలో చురుగ్గా వీధి కాలువల నిర్మాణ పనులు

పాలకొండ రూరల్: మండలంలోని పెద్దకోటిపల్లి గ్రామంలో వీధి కాలువల నిర్మాణ పనులు చురుగ్గా సాగుతున్నాయి. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో తమ గ్రామానికి వచ్చిన ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి, ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ దృష్టికి స్థానికులు తమ సమస్యలు తీసుకువెళ్లారు. ఇందులో భాగంగానే అభివృద్ధి పనులు ప్రారంభమైనట్టు సర్పంచ్ ఎస్.మంగామణి తెలిపారు. సర్పంచ్ ఈ పనులను శుక్రవారం పరిశీలించారు. తమ గ్రామం మీదుగా గుడివాడ చెరువును కలుపుతూ లుంబూరు గ్రామాల మధ్య రహదారి నిర్మాణం కూడా యుద్ధ ప్రాతిపదికన జరుగుతున్నట్టు సర్పంచ్ తెలిపారు.

### రీసర్వే వేగవంతం చేయాలి



సర్వే పరిశీలిస్తున్న మండల సర్వేయర్, డీటీ

వంగర: గ్రామాల్లో భూముల రీసర్వే వేగవంతం చేయాలని మండల సర్వేయర్ వై.అప్పలనాయుడు అన్నారు. మండల కేంద్రం వంగరలో జరుగుతున్న భూముల రీ సర్వేను శుక్రవారం ఆయన పరిశీలించారు. డ్రోన్ ద్వారా సర్వే పాయింట్లను గుర్తించి సర్వే వేగవంతానికి చర్యలు తీసుకుంటున్నామన్నారు. కార్యక్రమంలో రీసర్వే డీటీ ఈశ్వరరావు, సాంకేతిక సిబ్బంది, గ్రామ సర్వేయర్లు పాల్గొన్నారు.

### ఈ - ఆశ యాప్‌పై అవగాహన



ఆశ కార్యకర్తలకు అవగాహన కల్పిస్తున్న వైద్యాధికారి రవీంద్ర

భామిని: బత్తిలి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యాధికారి కొండపల్లి రవీంద్ర ఆశాలతో శుక్రవారం సమావేశం నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వం కొత్తగా తెచ్చిన ఈ - ఆశ యాప్‌లో గర్భిణుల వివరాల నమోదుపై అవగాహన కల్పించారు. గర్భిణులకు అందుతున్న సేవలు, నెలవారీ తనిఖీలు తదితర అంశాలు నమోదు చేసే విధానాన్ని తెలిపారు. వైద్య సిబ్బంది, ఏఎన్ఎంలు పాల్గొన్నారు.

### అంకితభావంతో పని చేయాలి



వైద్య సిబ్బందికి అవగాహన కల్పిస్తున్న డీఐఓ జగన్‌మోహన్‌రావు

గుమ్మలక్ష్మీపురం: ప్రజారోగ్యం కోసం వైద్య సిబ్బంది సమష్టిగా, అంకితభావంతో పని చేయాలని జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి టి.జగన్‌మోహన్‌రావు అన్నారు. మండలంలోని కొత్తగూడెంలో ఆశ కార్యకర్తలు, వైద్య సిబ్బందితో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొని ఆరోగ్య కార్యక్రమాలపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గర్భిణుల పట్ల అప్రమత్తంగా ఉండాలని, హైరిస్క్ ఉన్న వారిని గుర్తించి ప్రత్యేక శ్రద్ధ కనబరచాలన్నారు. వైద్యాధికారి బుద్దేశ్వరరావు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

### నేడు వాహనాల వేలం

మక్కువ: సారా తరలింపులో పట్టుబడిన వాహనాలను స్థానిక పోలీస్‌స్టేషన్‌లో శనివారం వేలం వేయనున్నట్లు ఎస్సై జి.పైడిరాజు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు.

# అధికారుల తీరుపై ఆగ్రహం

- రూ.6 కోట్ల బిల్లులు మార్చేశారు..
- మధ్యలో రోడ్డు పనులు ఆపేశారు..
- కాంట్రాక్టర్లకు ఇంజినీర్లు కొమ్ముకాస్తున్నారు..
- వాడీవేడిగా మండల సమావేశం

సీతంపేట:

గిరిజన సంక్షేమ ఇంజినీరింగ్ శాఖ ద్వారా 29 రహదారుల నిర్మాణానికి రూ.6 కోట్లు మార్చి నెలలో మంజూరైతే బిల్లులు మార్చేసి పనులు పూర్తి చేయకుండా అర్ధాంతరంగా నిలిపి వేయడమేమిటని పాలకొండ ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతితో పాటు పలువురు సర్పంచ్‌లు, ఎంపీటీసీలు అధికారులను ప్రశ్నించారు. స్థానిక వైటీసీలో శుక్రవారం జరిగిన మండల పరిషత్ సర్వసభ్య సమావేశంలో ఇంజినీరింగ్ అధికారులను ప్రజాప్రతినిధులు నిలదీశారు. దాసుగుమ్మడ - పెద్దతంకిడి, పులిగుమ్మి, సంకిలి, లాడ, కుమ్మరిగండి, వంబరెల్లి తదితర చోట్ల రోడ్డు పనులు నిలిచిపోయాయన్నారు. ఎగువ ద్వారబందం రహదారి నిర్మాణ పనులు నాణ్యత లోపించాయని ఏఎంసీ చైర్మన్ హిమరక మోహన్‌రావు అన్నారు. చిన్నకంబ - బుడగరాయి రహదారి నాణ్యతా లోపం ఉందని అక్కడి సర్పంచ్ తెలిపారు. ఏప రోడ్లకు బిల్లులు ఇచ్చారో చెప్పాలని సభ్యులు పట్టుబట్టారు. దీనికి డీఈ కృష్ణకుమార్ సరిగా సమాధానం చెప్పకపోవడంతో ఇంజినీరింగ్ అధికారులు కాంట్రాక్టర్లకు కొమ్ముకాస్తున్నారని ఎమ్మెల్యేతో



ఇంజినీరింగ్ డీఈని ప్రశ్నిస్తున్న ఎమ్మెల్యే కళావతి

పాటు సర్పంచ్‌లు ఆగ్రహం వ్యక్తం చేశారు. పనుల్లో నాణ్యతా లోపంపై విజిలెన్స్ విచారణ చేయిస్తామని హెచ్చరించారు. చావిడవలస స్కూల్ పనుల్లో నాణ్యత లోపించాయని, దీనిపై గత సమావేశంలో చెప్పినా పట్టించుకోలేదన్నారు. ఆర్‌డబ్ల్యూఎస్ ద్వారా మంచినీటి సౌకర్యం కోసం చేపడుతున్న పనుల్లో జాప్యం జరుగుతుందని ఎంపీటీసీ, సర్పంచ్‌లు తెలిపారు. ఆసరా డబ్బులు కొంత మంది మహిళల ఖాతాల్లో జమ కాలేదని వైస్ ఎంపీపీ కుండంగి సరస్వతి తెలిపారు. డబ్బులు జమయ్యే విధంగా చర్యలు తీసుకోవాలని వైకేపీ సిబ్బందికి ఎమ్మెల్యే సూచించారు. రుణాలు తీసుకుని తిరిగి చెల్లించని వారిని డిఫాల్టర్లుగా గుర్తించి తొలగించాలన్నారు. ఫారెస్టు ఏరియాలో నివసిస్తున్న 46 గ్రామాల గిరిజనులను రెవెన్యూ పరిధిలోకి తీసుకువచ్చేందుకు చర్యలు తీసుకుంటున్నామని తహసీల్దార్ నరసింహమూర్తి తెలిపారు. దీనిపై ఎమ్మెల్యే చొరవ చూపారన్నారు.

**'సురక్ష' సద్వినియోగం చేసుకోవాలి**

జగనన్న సురక్ష పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే కళావతి కోరారు. గ్రామ సచివాలయాలకు 30 రోజుల పాటు అధికారులు బృందాలుగా ఏర్పడి వస్తారని, 11 రకాల ధ్రువపత్రాలు మంజూరు చేస్తారన్నారు. ఉచితంగా సేవలు పొందవచ్చన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ బి.ఆదినారాయణ, వైస్ ఎంపీపీ కె.సరస్వతి, జెడ్పీ కోఆప్షన్ సభ్యులు ఎస్.లక్ష్మి, ఎంపీడీవో కె.సత్యం, ఏవో మాస, పీఆర్ డీఈ లోకనాదం, ఏఈ కిరణ్‌కుమార్, సీడీపీవో రంగలక్ష్మి, పశువైద్య శాఖ ఏడీ శ్రీనివాసరావు, పశువైద్యాధికారి ఆర్.శంకరరావు, ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ ఢిల్లేశ్వరరావు, ఏఈ పాపారావు తదితరులు పాల్గొన్నారు.

# కేజీబీవీ ఏర్పాటుకు కృషి చేద్దాం..

- మండల సమావేశంలో ఎమ్మెల్సీ విక్రాంత్

పాలకొండ రూరల్: డివిజన్ కేంద్రం పాలకొండలో కేజీబీవీ పాఠశాల ఏర్పాటుకు సమష్టిగా కృషి చేయాల్సిన అవసరం ఉందని ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ అన్నారు. ఈ ప్రాంత విద్యార్థినులను మరింత అక్షరాస్యులుగా తీర్చిదిద్దేందుకు కేజీబీవీ ఎంతగానో దోహదపడుతుందన్నారు. ఎంపీపీ బొమ్మాళి భాను అధ్యక్షతన శుక్రవారం ఎంపీడీఓ కార్యాలయంలో నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. స్థానిక ప్రజాప్రతినిధులు ఈ మేరకు తీర్మానం చేయటం ద్వారా సంబంధిత ఉన్నాధికారుల సహకారం కూడగడతామన్నారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో సంక్షేమ పథకాల అమలు విషయంలో ప్రజాప్రతినిధులు, అధికారులు జవాబుదారీతనంతో వ్యవహరించాలన్నారు. జగనన్న సురక్ష కార్యక్రమాన్ని అంకిత భావంతో నిర్వహించాలన్నారు. మండలంలో అమ్మ ఒడి విజయోత్సవాలను నిర్వహించాలని సూచించారు. ఎంపీపీ మాట్లాడుతూ మండలంలో అన్ని పంచాయతీల అభివృద్ధికి అధికారులు సమన్వంతో వ్యవహరించాలన్నారు. వైస్ ఎంపీపీలు కనపాక సూర్యప్రకాష్, వాకముడి అనీల్‌కుమార్ తదితరులు



మండల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ విక్రాంత్

ప్రస్తుత వ్యవసాయ సీజన్‌లో సంబంధిత అధికారులు రైతుభరోసా కేంద్రాల ద్వారా సేవలు మరింత విస్తృతం చేయాలన్నారు. మండల సర్పంచుల సంఘం అధ్యక్షుడు లోలుగు విశ్వేశరరావు ఐసీడీఎస్, విద్యారంగ పనితీరుపై ప్రస్తావించారు. గృహ నిర్మాణ, విద్య, విద్యుత్, వైద్య, ఆర్టీసీ, గ్రామీణ నీటిపారుదల, అటవీ, వైకేపీ, ఉపాధి హామీ, బీసీ, ఎస్సీ, ఎస్టీ సంక్షేమ తదితర శాఖల అధికారులు తాజా పురోగతులను గణాంకాలతో సహా సమావేశం దృష్టికి తీసుకువచ్చారు. సభ్యులు అడిగిన ప్రశ్నలకు సంతృప్తికర సమాధానాలు అందించారు. బీసీ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ నల్లి శివప్రసాద్, సర్పంచులు, ఎంపీటీసీలతో పాటు ఎంపీడీవో జె. ఉమామహేశ్వరి, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

# సత్ప్రవర్తనతో మంచి ఫలితాలు




సదస్సులో మాట్లాడుతున్న న్యాయమూర్తి రోహిణిరావు

కురుపాం: విద్యార్థులు సత్ప్రవర్తన కలిగి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ మద్ది రోహిణి అన్నారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం జరిగిన న్యాయ విజ్ఞాన సదస్సులో మెజిస్ట్రేట్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. బాల కార్మిక వ్యవస్థ నిర్మూలన కోసం తీసుకోవాల్సిన చర్యల గురించి వివరించారు. ఈ సందర్భంగా బాలలతో వెట్టిచాకిరి చేయించడం, పనుల్లో చేర్పించడం, మాదక ద్రవ్యాలను విక్రయించడం, లైంగికంగా వేధించడం వంటి చర్యలకు పాల్పడితే చట్టరీత్యా నేరమన్నారు. అటువంటి వారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. సదస్సులో న్యాయవాదులు బరాటం చంద్రమౌళి, కె.అశోక్‌కుమార్, న్యాయవాదులు కుమారస్వామి, స్రవంతి, ప్రధాన ఉపాధ్యాయుడు తోట శంకరరావు పాల్గొన్నారు.

# నవరత్నాలతో ఇంటింటా వెలుగులు



కొంచ గ్రామంలో ప్రభుత్వ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే కళావతి, ఎమ్మెల్సీ విక్రాంత్

- 'గడప గడప'లో ఎమ్మెల్యే కళావతి

వీరఘట్టం: రాష్ట్రంలో జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం వచ్చాక నవరత్నాలతో ఇంటింటా వెలుగులు విరబూస్తున్నాయని ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి అన్నారు. హుస్సేనుపురం సచివాలయ పరిధి కొంచ గ్రామంలో శుక్రవారం నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను వివరించారు. మరోవైపు ప్రజల సమస్యలు తెలుసుకుంటూ పరిష్కారానికి భరోసానిస్తూ కార్యక్రమాన్ని కొనసాగించారు. నాలుగేళ్ల పాలనలో ప్రతీ ఇంటికి కలిగిన లబ్ధిని వివరించారు. గత ప్రభుత్వ హయాంలో పింఛన్ల కోసం ఇబ్బందులు పడేవారని, నేడు వలంటీర్లే ఇంటింటికి వెళ్లి అందజేస్తున్నారని చెప్పారు. మహిళల అభివృద్ధి, సాధికారత కోసం ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి ఓ సోదరుడిలా సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నారని తెలిపారు. ముఖ్యమంత్రిగా జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి ఆశీర్వదించాలన్నారు. ఈ సందర్భంగా పలువురు మహిళలు వీధి కుళాయిలు, ఇళ్లు మంజూరు చేయాలని కోరారు. స్పందించిన ఎమ్మెల్యే అధికారులతో మాట్లాడి సమస్యలను పరిష్కరించాలని ఆదేశించారు. ఎంపీపీ దమలపాటి వెంకటరమణనాయుడు, జెడ్పీటీసీ జంపు కన్నతల్లి, రెవెన్యూ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

### రెండు బృందాలతో 'జగనన్న సురక్ష'

గరుగుబిల్లి: మండలంలో జగనన్న సురక్ష కార్యక్రమం రెండు బృందాల ద్వారా నిర్వహించనున్నట్టు ఎంపీపీ ఉరిటి రామారావు, జెడ్పీ వైస్‌చైర్మన్ మరిశర్ల బాపూజీనాయుడు తెలిపారు. మండల పరిషత్ కార్యాలయంలో వారు విలేకరులతో శుక్రవారం మాట్లాడారు. మండలంలోని రావివలస, రావుపల్లి గ్రామాల్లో జగనన్న సురక్ష కార్యక్రమాన్ని శనివారం నిర్వహించనున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమం ద్వారా వీలైనంత ఎక్కువ సేవలు అందించాలన్నారు.

**కాట్రగడ బీలో 'జగనన్న సురక్ష'**

భామిని: మండలంలోని కాట్రగడ బీలో జగనన్న సురక్ష కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు తోట సింహాచలం, ఎంపీపీ తోట శాంతికుమారి పర్యవేక్షణలో ఇంటింటికి వెళ్లి కార్యక్రమ లక్ష్యాలను వివరించారు. సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు, గృహ సారథులు పాల్గొన్నారు.

### విద్యుత్ సమస్యలపై ఆందోళన

సీతంపేట: విద్యుత్ సమస్యలపై సీతంపేట విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద సీపీఎం ఆధ్వర్యంలో శుక్రవారం ధర్నా నిర్వహించారు. ధర్నాలో ఆ పార్టీ మండల కార్యదర్శి ఎ.భాస్కరరావు మాట్లాడుతూ సర్దుబాటు చార్జీల విధానం రద్దు చేయాలన్నారు. స్మార్ట్ మీటర్ల నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని కోరారు. 200ల యూనిట్లలోపు ఉచిత విద్యుత్ విధానం అమలు చేయాలన్నారు. అనంతరం ట్రాన్స్‌కో సిబ్బందికి వినతిపత్రం అందజేశారు.

### సేవలే గుర్తింపునిస్తాయి..



ప్రభాకరరావుకు జ్ఞాపికను అందజేస్తున్న హౌసింగ్ సిబ్బంది, పీడీ రమేష్

భామిని: ప్రభుత్వ ఉద్యోగికి తన పదవీ కాలంలో చేసిన సేవలే గుర్తింపునిస్తాయని జిల్లా హౌసింగ్ పీడీ తమ్మినేని రమేష్ అన్నారు. గృహ నిర్మాణ శాఖ ఏఈ లోచర్ల ప్రభాకరరావు శుక్రవారం పదవీ విరమణ చేయగా ఆయన సన్మాన కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ముందుగా ప్రభాకరరావును ఘనంగా సన్మానించారు. అనంతరం ఆయన సేవలను కొనియాడారు. హౌసింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

### బదిలీ ఉద్యోగికి సన్మానం



యుగంధర్‌కు సన్మానిస్తున్న అధికారులు

సీతంపేట: సీతంపేట ఐటీడీఏలో ఇన్‌చార్జి ఎడ్యుకేషన్ ఓఎస్‌డీగా పనిచేసి భద్రగిరి గిరిజన గురుకుల బాలుర కళాశాలకు ప్రిన్సిపాల్‌గా బదిలీపై వెళ్లిన మల్లి సీవోఈ కళాశాల ప్రిన్సిపాల్ యుగంధర్‌కు స్థానిక ట్రైబుల్ వెల్ఫేర్ కార్యాలయంలో శుక్రవారం ఘనంగా సన్మానించారు. ఆయన సేవలను అధికారులు కొనియాడారు. కార్యక్రమంలో గిరిజన సంక్షేమ శాఖ డీడీ శ్రీనివాసరావు, గురుకులం సెల్ ఇన్‌చార్జి వెంకటేశ్వర్లు, స్పోర్ట్స్ ఇన్‌చార్జి జాకాబ్ దయానంద్, ఏఎంవో కోటిబాబు, జీసీడీవో రాములమ్మ, సూపరింటెండెంట్ దేశ్ తదితరులు పాల్గొన్నారు.

# అధికారుల గైర్హాజరుపై సభ్యుల ధ్వజం



సమావేశంలో పాల్గొన్న ఎంపీపీ రామారావు, ఇతర సభ్యులు

గరుగుబిల్లి: మండల పరిషత్ సర్వసభ్య సమావేశానికి తోటపల్లి ఇరిగేషన్ అధికారులు గైర్హాజరు కావడంతో సభ్యులు తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో ఎంపీపీ ఉరిటి రామారావు అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం శుక్రవారం నిర్వహించారు. తోటపల్లి పాత రెగ్యులేటర్ పరిధిలోని కుడి, ఎడమ కాలువ ద్వారా సాగునీరు విడుదల చేయకపోవడంతో పలువురు సభ్యులు ధ్వజమెత్తారు. ఖరీఫ్ ప్రారంభమైనప్పటికీ ఇంతవరకు సాగునీరు సరఫరాపై ఎలాంటి ప్రకటన చేయకపోవడంపై రైతులు ఆందోళన చెందుతున్నారని సభ్యులు పేర్కొన్నారు. జంఝావతి కాలువ పరిధిలో పలుచోట్ల పూడికలు తొలగించకపోవడంతో సాగునీటి సరఫరాకు ఇబ్బందులు ఎదురవుతున్నాయని పలువురు సభ్యులు తెలిపారు. ఈ సందర్భంగా జంఝావతి ప్రాజెక్టు జేఈ శ్రావణి మాట్లాడుతూ కాలువల్లో పూడికలు తొలగించేందుకు ఇప్పటికే ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపించామన్నారు. మండల వ్యవసాయాధికారి ఆర్.విజయభారతి మాట్లాడుతూ ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి రైతులకు అవసరమైన ఎరువులను ఆర్‌బీకేల ద్వారా సరఫరా చేయడం జరుగుతుందన్నారు. సమావేశంలో జెడ్పీ వైస్‌చైర్మన్ మరిశర్ల బాపూజీనాయుడు, వైస్ ఎంపీపీలు బి.లక్ష్మి, ఎస్.లక్ష్మి, తహసీల్దార్ జీవీ జనార్దన్, ఎంపీడీఓ పైడితల్లి, ఈఓపీఆర్‌డీ ఎల్.గోపాలరావు, సూపరింటెండెంట్ ఎస్.అర్జున్‌రావుతో పాటు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

### ఎస్ఆర్‌పురంలో సీసీరోడ్డు నిర్మాణం

మక్కువ: మండలంలోని ఎస్ఆర్‌పురం గ్రామంలో సర్పంచ్ బెల్లాన కృష్ణమూర్తి పర్యవేక్షణలో అధికారులు సీసీరోడ్డు నిర్మిస్తున్నారు. గడపగడపకూ మనప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా గ్రామంలో డిప్యూటీసీఎం పీడిక రాజన్నదొర ఇటీవల పర్యటించారు. ఈ సందర్భంగా గ్రామంలో సీసీరోడ్లు లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నట్లు సర్పంచ్ కృష్ణమూర్తి ఆయనకు విన్నవించారు. దీంతో గడగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిధులు సుమారు రూ.2లక్షలు మంజూరుచేయడంతో సీసీరోడ్డు నిర్మాణపనులను సర్పంచ్ కృష్ణమూర్తి శుక్రవారం చేపట్టారు. ఎన్నో ఏళ్లనుంచి సీసీరోడ్డు లేక ఇబ్బందులు పడుతున్న గ్రామస్తులు ఈ సందర్భంగా సంతోషం వ్యక్తం చేశారు.

# విత్తనాలు వేసే విధానంపై అవగాహన

పాలకొండ రూరల్: మండలంలోని లుంబూరు ఆర్‌బీకే పరిధిలో సీడ్ కమ్ ఫెర్టిలైజర్ డ్రిల్ యంత్ర సాయంతో విత్తనాలు వేసే విధానంపై రైతులకు శుక్రవారం అవగాహన కల్పించారు. కౌలు రైతు రఘు మండల చిన్నంనాయుడు పొలంలో వరి ఈ యంత్ర సాయంతో విత్తనాలు వేశారు. ఈ విధానంలో దమ్ము చేయకుండానే నేరుగా విత్తనాలు వేయడం జరుగుతుందన్నారు. ఈ సందర్భంగా ఏఓ ఎన్ని వాహిని మాట్లాడుతూ ప్రభుత్వం రైతులకు అవసరమైన రాయితీ విత్తనాలు, ఎరువులు అందుబాటులో ఉన్నాయన్నారు. గ్రామీణ వ్యవసాయ సహాయకులు అమిత్‌పాడీ, రైతులు పాల్గొన్నారు.



సీడ్ కమ్ ఫెర్టిలైజర్ డ్రిల్‌తో వరి వంగడాలు వేస్తున్న అధికారులు, రైతులు

# పరిసరాల పరిశుభ్రతతోనే ఆరోగ్యం

పాలకొండ: పరిసరాల పరిశుభ్రతతోనే సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని, ప్రజలు తమ పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని పార్వతీపురం మన్యం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి బగాది జగన్నాథరావు సూచించారు. శుక్రవారం నిర్వహించిన డ్రైడే ఫ్రైడే కార్యక్రమంలో పాల్గొన్న ఆయన వార్డుల్లో పర్యటించి పారిశుద్ధ్యంపై ప్రజలకు అవగాహన కలిగించారు. డెంగీ దోమల నివారణతో పాటు రోగాలు రాకుండా ఉండాలంటే ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. సీజనల్ వ్యాధులకు గల కారణాలను వివరించారు. ఇంటి ఆవరణలో చెత్తతో పాటు నీరు నిల్వ ఉండే వస్తువులను తొలగించాలన్నారు. వారంలో ఒక రోజు నీటి కుండీలను ఆరబెట్టాలని తెలిపారు. ఆయనతో పాటు అర్బన్ హెల్త్‌క్లినిక్ సిబ్బంది పాల్గొన్నారు.



పట్టణంలోని వార్డుల్లో పరిసరాలు పరిశీలిస్తున్న డీఎంహెచ్‌వో

# అందరి సహకారంతోనే అభివృద్ధి

పాలకొండ: అధికారులు, పాలకవర్గం సమన్వయంతో పనిచేయడం ద్వారా నగర పంచాయతీ అభివృద్ధి సాధ్యమవుతుందని నగర పంచాయతీ చైర్‌పర్సన్ యందవ రాధాకుమారి అన్నారు. నగర పంచాయతీ కౌన్సిల్ సాధారణ సమావేశం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పట్టణంలో అత్యవసర పనుల కోసం తీర్మాణం ప్రవేశ పెడుతున్నామని తెలిపారు. శివారు ప్రాంతాల్లో పారిశుధ్య నిర్వహణ, సీసీ రహదారుల నిర్మాణం, కాలువల నిర్మాణం, తాగునీటి సరఫరా కోసం పలు తీర్మాణాలను ఏకగ్రీవంగా ఆమోదించారు. డంపింగ్ యార్డు పనులు కొంతమంది అడ్డుకుంటున్నారని దీనిపై చర్యలు తీసుకోవాలని పలువురు కౌన్సిలర్లు సమావేశం దృష్టికి తీసుకువచ్చారు. దీనిపై పోలీసులకు ఫిర్యాదు చేసి తగు చర్యలు తీసుకుంటామని కమిషనర్ సర్వేశ్వరరావు తెలిపారు. సమావేశంలో వైస్ చైర్మన్‌లు రౌతు హనుమంతురావు, పల్లా ప్రతాప్, కౌన్సిలర్లు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న చైర్‌పర్సన్ రాధాకుమారి

# ముగిసిన రథయాత్ర

పాలకొండ: స్థానిక జగన్నాథస్వామి రథయాత్ర శుక్రవారంతో ముగిసింది. తొమ్మిది రోజులుగా నిర్వహించిన రథయాత్రలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామివారి దర్శనం చేసుకున్నారు. చివరి రోజు రథం ప్రధాన ఆలయం వరకు తీసుకువచ్చి భక్తులకు దర్శనం కల్పించారు. అనంతరం విగ్రహాలను ప్రధాన ఆలయంలోనికి తీసుకువెళ్లడంతో యాత్ర ముగిసింది. ఆలయ ఈవో వి.రాధాకృష్ణ, పోలీసు సిబ్బంది యాత్ర విజయవంతం చేయడంతో కృషి చేశారు.

# ఇసుక అక్రమ రవాణా

కొమరాడ: మండలంలోని కళ్లికోట, గుమడ గ్రామాల్లో సమీపంలోని నాగావళి నది నుంచి వందలాదిగా నాటు బండ్లతో ఇసుక అక్రమ రవాణా జరుగుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని ఆయా గ్రామాల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇలాగే ఇసుకను తోడేస్తే వర్షాకాలంలో నదీ ప్రవాహం పెరిగితే గ్రామాల్లోకి నీరు వస్తుందని వారు పేర్కొంటున్నారు. నాటు బండ్లతో పగటి పూట దర్జాగా ఇసుకను తరలించి ఎక్కడో ఒక చోట డంపింగ్ చేసి రాత్రిపూట ట్రాక్టర్ల సాయంతో తరలిస్తున్నారని వారు ఆరోపిస్తున్నారు. ఎన్నిసార్లు పోలీసుల, రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అనుమతి లేకుండా తరలిస్తున్న ఇసుక అక్రమ రవాణాకు ఇప్పటికైనా అడ్డుకట్ట వేయాలని వారు కోరుతున్నారు.



కళ్లికోట గ్రామ సమీపంలో నాగావళి నదిలో ఇసుక తరలింపులో నాటు బండ్లు